క్లుప్తంగా

పరశురామ అవతారంలో భజే నారాయణస్వామి

రంగంపేట: మండలంలోని వడిశలేరులో కొలువైయున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీభజేనారాయణ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం స్వామివారిని పరశురామ అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బుధవారం శ్రీరామ అవతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ముమ్మన రాంబాబురెడ్డి తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

సీతానగరం:ఉండేశ్వరపురానికి చెందిన పద్దెనిమిదేళ్ల గుమ్మళ్ల శిరీష సోమవారం నుంచి కనిపించడం లేదని తల్లి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న శిరీష సోమవారం రాజమహేంద్రవరం కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు.

ఎల్ఐసీ జీవన్ ఉత్సవ్‌పై అవగాహన



సదస్సులో పాల్గొన్న ఎల్ఐసీ అధికారులు, ఏజెంట్లు

సీతానగరం: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నుంచి కొత్తగా వచ్చిన జీవన్ ఉత్సవ్ పాలసీపై మంగళవారం సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ బ్రాంచ్ మేనేజర్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఎల్ఐసీ నుంచి కొత్తగా వచ్చిన జీవన్ ఉత్సవ్ పాలసీలో ప్రజలందరికి ఉపయోగపడే ప్రయోజనాలెన్నో ఉన్నాయన్నారు. బ్రాంచ్ ఏబీఎం వినోద్ కుమార్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేష్, సీతానగరం పరిసర ప్రాంతాల ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం



ఎంపిక చేసిన విద్యార్థుల బృందంతో ఐటీసీ సిబ్బంది

బిక్కవోలు: మండలంలోని పందలపాక శ్రీపడాల పెదపుల్లారెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులకు అనపర్తి ఐటీసీ సంస్థ ప్రతినిధులు పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు సమాజంలో మార్పులను గమనిస్తూ పరిశుభ్రతపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఐటీసీ ప్రాజెక్ట్ అధికారి శిధర్ వివరించారు. అనంతరం పాఠశాల నుంచి పది మంది విద్యార్థుల బృందాన్ని ఎంపికచేశారు. వారిని అనపర్తి ఐటీసీకి తీసుకెళ్లి వివిధ అంశాలపై శిక్షణ అందిస్తామని శిధర్ తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి, పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లకు నంబర్లు

సీతానగరం: మండలంలోని పోలింగ్ స్టేషన్ వద్ద నంబర్లు వేస్తున్నామని తహసీల్దార్ పాగిరి కృష్ణారావు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ మండలంలో 61 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద నంబర్లను పెయింట్‌తో వేస్తున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామన్నారు.

ఉపాధి మేట్లకు శిక్షణ

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఎన్ఆర్ఈజీఎస్ మేట్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీలతో సక్రమంగా పనులు చేయించాలన్నారు. వారు రోజుకు రూ.272 అందుకునేలా చూడాలన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా రోజుకు రెండుసార్లు హాజరు పంపాలని సూచించారు. మూడు బ్యాచ్‌లకు గురువారం వరకూ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.నాగేషవేణి, టెక్నికల్ అసిస్టెంట్లు ఏఆర్‌బీ చక్రవర్తి, సుదర్శన్, కంప్యూటర్ ఆపరేటర్ మొహిద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యువకుడి మృతి

సీతానగరం: తణుకుకు చెందిన ఆచంట అవినాష్ (23) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజు తెలిపారు. అవినాష్ కామెర్లుతో బాధపడుతున్నాడు. జాతకం చెబుతారని తెలుసుకుని సోమవారం సీతానగరం వచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున శివాలయం వద్ద పడిపోగా స్థానికులు బస్టాండ్ వద్దకు తీసుకువచ్చారు. మళ్లీ పడిపోగా అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం, మృతుడి తమ్ముడు చందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులకు జలకళ

- రబీ సాగుకు సమృద్ధిగా నీరు
- అన్నదాతల హర్షం



జలకళతో ఉట్టిపడుతున్న ఫరిజల్లిపేటలోని ఊరచెరువు

రాజానగరం: వ్యవసాయం నీటి ఆధారితమైనదనే విషయం అందరికీ తెలిసిందే. డెల్టా ప్రాంతంలో కాలువల ద్వారా గోదావరి జలాలు పుష్కలంగా ప్రవహిస్తుంటాయి. అయితే మెట్ట ప్రాంతానికి ఆ విధమైన సదుపాయాలు లేక రైతులు ఎక్కువగా భూగర్భ జలాలపై ఆధారపడతారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నవంబర్‌లో తుపానుల ప్రభావంతో భారీగా కురిసిన వర్షాలతో ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలకు అక్కడక్కడా కొద్దిపాటి సమస్యలు వచ్చాయి. ప్రస్తుత రబీ సీజన్‌కు మాత్రం నీటి కొరత లేకుండా ఉందని రైతులు చెబుతున్నారు. భారీగా కురిసిన వర్షాలతో మెట్టలో చెరువులన్నీ నీటితో కళకళాడుతున్నాయి. చెరువుల్లో సామర్థ్యానికి మించి నీటి నిల్వలు ఉండటంతో రబీ సీజన్ సజావుగా సాగనుంది.

పెరిగిన భూగర్భ జలాలు

సకాలంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో జూలై నుంచి ప్రారంభమైన వర్షాలు ఇప్పటికీ అడపా దడపా కురుస్తూనే ఉన్నాయి. సాధారణంగా ఈ ఏడాది పెద్దగా వర్షాలు పడలేదనుకుంటున్న సమయంలో తుపానుల మాసంగా పేరొందిన నవంబర్‌లో ఏర్పడిన అల్పపీడనాలతో భారీగా వర్షాలు కురిశాయి. దీనితో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఉన్న చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. భూగర్భంలో కూడా నీటి సాంద్రత పెరగడంతో పలుచోట్ల గొట్టపు బావుల నుంచి పాతాళగంగ పైకి ఉబికి వస్తోంది. కొద్దిపాటి ఎండలకే బీటలు వారే భూములు కూడా నేడు డెల్టాలో మాదిరిగా తడిగా దర్శనమిస్తున్నాయి. ఇంతవరకూ కురిసిన వర్షాపాతాన్ని పరిశీలిస్తే ఆగస్టులో సాధారణ వర్షపాతం 243 మి.మీ గాను 124.4 మి.మీ., సెప్టెంబర్‌లో 182 మి.మీగాను 280.6 మి.మీ. అక్టోబర్‌లో 190 మి.మీకుగాను 8.8 మి.మీ గా నమోదైంది. అదే నవంబర్‌లో సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా 215 మి.మీ కురిసింది.

నీటి సమస్య ఉండదు



ప్రస్తుతం ఎక్కడ చూసినా చెరువులు జలకళతో ఉట్టిపడుతున్నాయి. తుపానుల ప్రభావంతో నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు నీటితో నిండిపోయాయి. ఈ ఏడాది అంతంత మాత్రంగా కురిసిన వర్షాలతో వేసవిలో ముఖ్యంగా పశువులకు నీటి ఎద్దడి తప్పదేమోనని భయం వేసింది. కానీ నవంబర్ తుపానులు ఆ భయాన్ని తొలగించాయి. వేసవిలో రబీ పంటల సాగునీటికే కాదు, పశువుల దాహార్తిని తీర్చడానికి కూడా ఏవిధమైన ఇబ్బందులు రావనే భావిస్తున్నాం.

– అడబాల చినబాబు, రైతు, సీతారామపురం

బాధితులకు పరామర్శ



అడబాల వీరన్నను పరామర్శిస్తున్న డాక్టర్ రాజశ్రీ

రాజానగరం: నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ మంగళవారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, మీకు అండగా జక్కంపూడి కుటుంబం ఉందంటూ భరోసానిచ్చారు. బ్రెయిన్ సర్జరీ చేయించుకుని కలవచర్లలో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న పి.కన్నారావు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరామపురానికి చెందిన అడబాల వీరన్నలను పరామర్శించారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

రాజానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ (బీఎంసీయూ), మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ (ఎంపీఎఫ్‌సీ) పనులను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజభరత్ అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం ఆయా నిర్మాణాలను సందర్శించి, వాటి పనుల ప్రగతిపై స్థానిక అధికారులతో సమీక్షించారు. పనులకు సంబంధించిన చెల్లింపులలో ఏమైనా ఇబ్బందులుంటే చెప్పాలన్నారు. రూ.15.74 లక్షలతో నిర్మిస్తున్న బీఎంసీయూ పనులను సత్వరమే పూర్తి చేయాలని, జనవరి 2లోగా యూనిట్‌ను ప్రారంభించాలన్నారు. రూ.50 లక్షలతో నిర్మిస్తున్న ఎంపీఎఫ్‌సీ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయని అధికారులు ఆయనకు వివరించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ ఏబీవీ ప్రసాద్, ఏఈ సంపత్‌కుమార్, ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం, డీటీ సునీత పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, రైల్వే అధికారులు

అనపర్తి: స్థానిక రైల్వే ఉత్తర కేబిన్(తూర్పు రైల్వే గేటు) వద్ద గతంలో మూసివేసిన రైల్వే గేటు స్థానంలో రైల్వే అండర్ పాస్ వంతెన నిర్మాణానికి సంబంధించి రైల్వే అధికారులు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి స్థల పరిశీలన చేశారు. మంగళవారం అనపర్తి విచ్చేసిన రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు రాజేంద్రప్రసాద్, బాబూరావులు తూర్పు రైల్వే గేటు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ పాస్ వంతెన రెండింటిలో ఈ ప్రాంతం దేనికి అనువైనదో అన్న విషయమై రోడ్డు, రైల్వే ట్రాకు వద్ద కొలతలు తీసుకున్నారు. వంతెన ఆవశ్యకతను ఉన్నతాధికారులకు తెలియజేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఎమ్మెల్యే రైల్వే అధికారులను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వే గేటు మూసివేయడంతో కొన్నేళ్లుగా గేటు అవతల ఉన్న ప్రజలు అనపర్తి మెయిన్ రోడ్డుకు చేరేందుకు వ్యయప్రయాసలకు లోను కావాల్సి వస్తోందన్నారు. ప్రజల ఇబ్బందులకు ఎంపీ మార్గాని భరత్‌రామ్ దృష్టికి తీసుకురావడంతో ఆయన రైల్వే ఉన్నతాధికారులతో చర్చించారన్నారు. దీంతో స్థల పరిశీలనకు వచ్చిన ఇంజినీరింగ్ అధికారులు ఈ ప్రాంతంలో రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి కంటే అండర్ పాస్ వంతెన నిర్మిస్తే మంచిదని సూచిస్తున్నారని చెప్పారు. త్వరలోనే రైల్వే అండర్ పాస్ వంతెన నిర్మాణం జరిగి ప్రజల కష్టాలు తొలగిపోతాయన్న ఆశాభావాన్ని ఎమ్మెల్యే వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, సత్తి వెంకటరామారెడ్డి, సత్తి త్రినాథరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు కొండేటి భీమేష్, బండారు శ్రీనివాసరావు, మిలట్రీరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లిడి విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

రూపానగర్ అభివృద్ధికి కృషి

- లోవోల్టేజ్ పరిష్కారానికి చర్యలు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రూపానగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాజమహేంద్రవరం నగరానికి అత్యంత చేరువలో ఉన్న రూపానగర్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రూపానగర్‌లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూనే, గడచిన నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందించిన సంక్షేమ పథకాల వివరాలను కరపత్రాల ద్వారా తెలియజేశారు. పేదల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, అందుకు రాబోయే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలో గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు కేవలం రూ. 54 లక్షలు వెచ్చిస్తే, తాము అధికారంలోకి వచ్చాక రూ. 13.20 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ ప్రాంతంలో హైటెన్షన్ వైర్లు ఎక్కువగా ఉండటంతో లోవోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉంటుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులను పిలిచి ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచి, లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని సూచించారు. త్వరలోనే అర్హత ఉన్నవారందరికీ నివాస స్థలాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోయిడి సుబ్రహ్మణ్యం, ఆవాల సతీష్, రమణ, ఉమాకాంత్ రెడ్డి, కవలజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీల విజయవంతంపై అభినందనలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన సౌత్ అండ్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ 2023 – 24 పోటీలను విజయవంతం చేయడంలో భాగస్వాములైన అందరికీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ ఔన్నత్యానికి ప్రతీకగా ఈ పోటీలు నిలిచాయంటూ ఇక్కడకు దేశంలోని 11 రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు ప్రశంసించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో మహిళా సాధికారత

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- నర్సాపురం, గాదరాడలో మహిళలతో సమావేశం



గాదరాడలో జక్కంపూడి విజయలక్ష్మిని సత్కరిస్తున్న మహిళలు

మధురపూడి: జగనన్న ప్రభుత్వంలోనే మహిళా సాధికారిత సాధ్యమవుతోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం నర్సాపురం, గాదరాడ గ్రామాల్లో మంగళవారం డ్వాక్రా, ఎన్ఆర్ఈజీఎస్ మహిళలతో గ్రీవెన్స్ సమావేశం జరిగింది. విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా, సామాజికపరంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. ప్రభుత్వం అమలు జరుపుతున్న నవరత్నాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నార్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించారన్నారు. డ్వాక్రా, ఉపాధి మహిళల సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జక్కంపూడి విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నర్సాపురం సర్పంచ్ కడియాల పాపారావు, వైఎస్సార్ సీపీ నాయకులు హరిబోలు చినబాబు, మారిశెట్టి తేజోనాయుడు, శ్రీను, వెఎస్సార్ క్రాంతి పథం (వైకేపీ) ఏపీఎం ఎ.జయంతి రాజ్, గ్రామ సమాఖ్య అధ్యక్షులు అప్పలనర్స పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడకంతో దుష్పరిణామాలు

గోకవరం: డ్రగ్స్ వాడకంతో దుష్పరిణామాలు తలెత్తుతాయని కోరుకొండ ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని వీరలంకపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వలన కలిగే అనర్థాలపై ఎస్ఈబీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వివిధ మత్తు పదార్థాలు, వాటి వలన ఆరోగ్యానికి తలెత్తే హానిని వివరించారు. ప్రిన్సిపాల్ ఎంయూపీ రాణి పాల్గొన్నారు.

నేడు పందిరి మహాదేవుడు వర్ధంతి

సీటీఆర్ఐ: కోటిలింగాలపేటలో గల పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం వ్యవస్థాపకుడు పందిరి మహదేవుడు వర్ధంతిని బుధవారం సత్రం ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వీవీ పళ్లంరాజు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం పూజా కార్యక్రమం అనంతరం స్మార్త పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులకు వస్త్ర సమర్పణ, పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్న ప్రసాద వితరణ జరుగుతాయన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని 9 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.12.61 లక్షల విలువైన చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయనిధి ఒక వరమని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ వైద్యం చేయించుకునే స్తోమత లేని పేదలకు ఎప్పటికప్పుడు ఆర్థిక సాయం అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా వరినాట్లు పూర్తి చేయాలి

పెదపూడి: రబీ సీజన్‌కు సంబంధించి రైతులు వరి నాట్లు ఈ నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలని కాకినాడ జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్.విజయకుమార్ తెలిపారు. ఆయన పెదపూడి, దోమాడ గ్రామాల్లో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ, వెదసాగు చేసిన పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31న పంట కాలువలు ప్రభుత్వం మూసి వేయనున్న నేపథ్యంలో రైతులు త్వరగా వరినాట్లు పూర్తి చేయాలన్నారు. కాకినాడ జిల్లాలో 72,400 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారన్నారు. దీనిలో సుమారు 5 వేల హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయని చెప్పారు. రైతులు తప్పని సరిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదుతో తమ పంటను మద్దతు ధరకు అమ్ముకోవడానికి, పంట నష్ట పరిహారానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కాకినాడ వ్యవసాయశాఖ ఏడీఏ జీవీ పద్మశ్రీ, మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్, ఏఈఓ స్వామి, వీఏఏ దేవగుప్తాపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనతో అందరికీ లబ్ధి



సీతానగరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు



తొస్సిపూడిలో పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు



కోరుకొండలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు

సీతానగరం: రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్న జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. సీతానగరం సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న మాట్లాడుతూ గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లు అరిగేల తిరిగినా సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు స్వయంగా ఇంటింటికి వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. మండల ఆర్బీకె చైర్మన్ వలవల వెంకట్రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మూర్తి, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, కోలా శ్రీను, వలవల సత్తిబాబు, తోరం బ్రహ్మాజీ, వలవల వలీ, తోరం పోశియ్య, కాండ్రు వీరన్న, మట్ట మున్నియ్య పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బిక్కవోలు: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తుందని ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అన్నారు. మంగళవారం తొస్సిపూడి గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగులు నిండాయన్నారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొమరిపాలెం ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ దార్వంపూడి వెంకటరామారెడ్డి, ఎంపీటీసీ తేతల సుమ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తేతలి సూర్యచంద్రారెడ్డి, కర్రి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

మధురపూడి: రాష్ట్రానికి జగనన్న మళ్లీ సీఎం కావాలని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. కోరుకొండ సెంటర్‌లో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని సమ పాళ్లలో అమలు జరుపుతున్న ప్రభుత్వమిదే అన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పసుపులేటి బుల్లియ్యనాయుడు, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు కేతినీడి అశోక్, కోరుకొండ ఎంపీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్, పార్టీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, బొండాడ చందు, అయిల రామకృష్ణ, వాకా నరసింహరావు, బొరుసు బద్రి, పత్తి పాపారావు, తాతపూడి చక్రవర్తి పాల్గొన్నారు.